**సాధారణ కాలం – 4వ ఆదివారం (సంవత్సరం A)**
**జెఫన్యా 2,3 & 3,12–13; 1 కోరింథీయులు 1,26–31; మత్తయి 5,1–12**

**థీమ్:** ***అష్ట భాగ్యాలు (ధన్యవాక్యాలు) మన హృదయాలను తిరిగి నిర్మించి, దేవుని***

***శాంతి, కరుణ, న్యాయం యొక్క గుర్తులుగా మమ్మల్ని తయారు చేస్తాయి.***

**పరిచయం (INTRODUCTION)**

**ఒకసారి ఒక ప్రయాణికుడు ఒక నిర్మాణ స్థలంలో ఆగి, అక్కడ పని చేస్తున్న ఒక వృద్ధ మేస్త్రిని అడిగాడు:**
**"మీరు ఏమి నిర్మిస్తున్నారు?"**

**తల కూడా ఎత్తకుండా ఆ మేస్త్రి సమాధానమిచ్చాడు:**
**"నేను ఎప్పటికీ కలవని వారికి ఒక ఆశ్రయం పొందే ఇంటిని నిర్మిస్తున్నాను ",**

**అప్పుడు ఆ ప్రయాణికుడికి అర్థమైంది:**
**ఈ వ్యక్తి కేవలం రాళ్లు పేర్చడం కాదు—**
**తన జీవితాన్ని దాటి నిలిచే దానిని నిర్మిస్తున్నాడు.**

**మన జీవితాలు కూడా అలాగే ఉంటాయి.**
**ప్రతి రోజు, ప్రతి నిర్ణయంతో,**
**మన హృదయం నివసించే *లోపలి ఇంటిని* మనమే నిర్మించుకుంటాము.**

**కొన్ని రోజులు మనం బాగా నిర్మిస్తాము;**
**కొన్ని రోజులు తొందరపడతాము, మూలలు కోస్తాము.**
**అయినా దేవుడు తన సహనంతో, మళ్లీ మళ్లీ ప్రోత్సాహాన్ని ఇస్తూనే ఉంటాడు—**
**అర్థవంతంగా, ఆనందంగా జీవించే మార్గాన్ని.**

ఈరోజు సువార్తలో యేసు మనకు ఆ ప్రోత్సాహాన్ని ఇస్తున్నాడు:
ధన్యవాక్యాలు (Beatitudes).

అవి కేవలం వాగ్దానాలు మాత్రమే కాదు;
అవి ఆహ్వానాలు—
సౌమ్యంగా జీవించమని,
ధర చెల్లించాల్సి వచ్చినా న్యాయాన్ని కోరమని,
గాయపడిన చోట్లకు కరుణ తీసుకెళ్లమని,
వినయమైన హృదయంతో దేవునిపై విశ్వాసం పెట్టమని.

ఈ పవిత్ర బలి ఆరంభంలో,
మనలో తిరిగి నిర్మించాల్సిన వాటిని ప్రభువు తాకమని అడుగుదాం,
మన రోజులతో నిర్మించే ఈ ఇంటిని బలంగా, అందంగా,
ఆయన ఆశీర్వాదంతో నిండుగా ఉండేందుకు.

## ప్రసంగం - పరిపూర్ణ జీవితం కోసం ప్రమాణాలు: దేవుని అభినందనలు

ఒకసారి ఒక వృద్ధ కార్పెంటర్ చాలా సంవత్సరాలుగా నమ్మకంగా పని చేశాడు.
ఒక రోజు యజమాని అతనిని పిలిచి,
"ఇది నీ చివరి ఇల్లు—ఇదే నిర్మించు" అన్నాడు.

అతను అంగీకరించాడు గానీ,
ఇప్పుడు అతని మనసు పనిలో లేదు.
తక్కువ నాణ్యత గల వస్తువులు వాడాడు,
తొందరగా పని చేశాడు,
ప్రతిచోటా మూలలు కోసాడు.

ఇల్లు పూర్తయ్యాక యజమాని తాళాలు అతనికి ఇచ్చి అన్నాడు:
"ఈ ఇల్లు నీదే నీ కోసం కట్టుకున్నావు. ఇది నీకు **నా బహుమతి**."

ఆ కార్పెంటర్ మాటలేక నిలబడ్డాడు—
తన నిర్లక్ష్య పనియే ఇప్పుడు అతని నివాసం.

జీవితం కూడా మనం నిర్మించే ఇల్లు లాంటిదే.
మన జీవితం—మన అంతర్గత ఇల్లు—
బలంగా, అందంగా, పరిపూర్ణంగా ఉండేందుకు
యేసు మనకు ధన్యవాక్యాలను ఇస్తున్నాడు.

ధన్యవాక్యాలు
పరిపూర్ణ జీవితం కోసం యేసు ఇచ్చిన ప్రమాణాలు
మరియు
వాటిని జీవించే వారందరికీ దేవుడు ఇచ్చే అభినందనలు.

ఇప్పుడు వాటిలో కొన్ని చూద్దాం—
ప్రతి ఒక్కటి ఒక చిన్న కథతో.

## 1. "సౌమ్యులు ధన్యులు" – అహింస యొక్క బలం

కొన్ని సంవత్సరాల క్రితం ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ తన తరగతికి వచ్చేసరికి,
ఇద్దరు విద్యార్థులు గట్టిగా వాదించుకుంటున్నారు.
ఒకడు దాడికి సిద్ధంగా ఉన్నాడు.
ఇంకొకడు ప్రశాంతంగా ఇలా అన్నాడు:
"నిన్ను తిరిగి అవమానించను. నీవు ఇప్పుడు అలా అనిపించకపోయినా, నీవు నా స్నేహితుడివే."

ఆ ప్రశాంతత గొడవను చల్లార్చింది.
కోపంగా ఉన్న విద్యార్థి కన్నీళ్లు పెట్టుకుని అన్నాడు:
"ఈరోజు నాతో ఎవ్వరూ పోరాడకుండా ఉండటం నాకు కావాల్సింది."

సౌమ్యత అంటే బలహీనత కాదు.
అది నియంత్రణలో ఉన్న బలం.
శారీరక హింసకే కాదు—
మాటల హింసకు కూడా ఎదిరించే ధైర్యం.

ఇది మనం గాంధీ గారి అహింసా ఉద్యమంలో,
మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌లో,
1989 లోని శాంతియుత ప్రార్థనా ఉద్యమాల్లో చూస్తాము.

సౌమ్యులు ఈ లోకాన్ని స్వాధీనం చేసుకుంటారు—
ఎందుకంటే వారు దాన్ని మారుస్తారు.

సౌమ్యులు ధన్యులు—
అహింసాత్మకులు ధన్యులు—
గొడవలను చల్లార్చేవారు ధన్యులు.

## 2. "న్యాయం కోసం ఆకలి దప్పులు కలిగినవారు ధన్యులు" – దేవుని మార్గం కోసం తపన

ఒకసారి ఒక వ్యాపారి సూపర్‌మార్కెట్‌లో,
తన ముందున్న పేద తల్లికి డబ్బు సరిపోక ఇబ్బంది పడుతుండటాన్ని
గమనించాడు.
ఆమె సరుకులన్నిటికీ అతనే డబ్బు చెల్లించాడు.

ఆమె ఆశ్చర్యంతో అడిగింది:
"నాకు మీరు ఎందుకు సహాయం చేస్తున్నారు?"

అతను సమాధానమిచ్చాడు:
“ప్రజలు సరైనది చేసే ప్రపంచంలో నేను జీవించాలనుకుంటున్నాను. అందుకే నేను మొదట నాతోనే ప్రారంభిస్తున్నాను.”

ఇదే యేసు చెప్పేది.
మనకోసం మాత్రమే కాదు—
ఈ లోకమంతటికీ
సరైనదే జరగాలని లోతైన ఆకాంక్ష కలిగి ఉండడం.

బైబిల్లో న్యాయం అంటే కేవలం చట్టపరమైన న్యాయం కాదు.
అది దేవునితో సరైన సంబంధం—
అందువల్ల ఇతరులతో కూడా సరైన సంబంధం.

యేసు వాగ్దానం చేస్తున్నాడు:
“దేవుని న్యాయానికి ఆకలి దప్పులు కలిగినవారు **సంతృప్తిపొందుతారు**.”

బహుశా కాదు.
ఎప్పుడో కాదు.
తప్పక.

## 3. “కరుణ కలిగినవారు ధన్యులు” – మృదువైన హృదయం యొక్క శక్తి

ఒక యువ నర్సు చెప్పింది:
తాను చూసుకునే ఒక వృద్ధుడు తరచూ గట్టిగా మాట్లాడేవాడు.
ఇతర నర్సులు అతన్ని దూరంగా ఉంచేవారు.
ఆమె మాత్రం,
“అతను ఒంటరిగా ఉన్నాడని నాకు అనిపిస్తుంది” అంది.

ఒక రోజు అతను మెల్లగా అన్నాడు:
“నన్ను వదిలిపెట్టకుండా చూసుకున్నందుకు ధన్యవాదాలు.”

అతని హృదయం మృదువైంది.
ఆమె హృదయం కూడా మృదువైంది.
కరుణ ఇద్దరినీ మార్చింది.

కరుణ అంటే ఇదే:
• ప్రజలను వారు అర్హులైనంత మాత్రాన చూసుకోవడం కాదు
• దేవుడు నాకు ఇచ్చినదే ఇతరులకు ఇవ్వడం—సహనం, స్నేహం, అవగాహన.

యేసు అంటున్నాడు:
“వారు కరుణ పొందుతారు.”

అంటే:
“దేవుని హృదయాన్ని ఇతరులకు ఇవ్వండి—
దేవుడు తన హృదయాన్ని మీకు ఇస్తాడు.”

కరుణే దేవుని రాజ్యంలోని మృదువైన నాణెం.

## 4. “హృదయశుద్ధి గలవారు ధన్యులు” – కొత్త కళ్లతో దేవుణ్ణి చూడటం

ఒక చిన్న అమ్మాయి తన అమ్మమ్మను అడిగింది:
“మీరు దేవుణ్ణి ఎలా చూస్తారు?”

అమ్మమ్మ సమాధానం:
“నీ హృదయం నిశ్శబ్దంగా ఉన్నప్పుడు, ఆయనను ప్రతిచోటా గమనించడం మొదలుపెడతావు.”

ఆ పిల్ల కొద్దిసేపు ఆలోచించి మెల్లగా అంది:
“ఈ ఉదయం సూర్యోదయంలో ఆయనను చూశాననుకుంటా.”

శుద్ధ హృదయం అంటే లోపం లేకపోవడం కాదు.
అది విభజన లేని హృదయం—
యేసు మాత్రమే నివసించే హృదయం.

శుద్ధ హృదయం ప్రపంచాన్ని భిన్నంగా చూస్తుంది:
• ఇతరులు యాదృచ్ఛికం చూస్తే—ఇది దైవ నిర్వహణను చూస్తుంది.
• ఇతరులు ప్రకృతిని చూస్తే—ఇది సృష్టికర్తను చూస్తుంది.
• ఇతరులు విషాదాన్ని చూస్తే—ఇది దేవుని దాగిన సమీపాన్ని చూస్తుంది.

సెంట్-ఎక్సుపెరీ ఇలా అన్నాడు:
"హృదయంతోనే స్పష్టంగా చూడగలం."

శుద్ధ హృదయులు
ఈ లోకంలోనే దేవుణ్ణి చూడడం ప్రారంభిస్తారు.

## 5. "ఆత్మలో పేదలు ధన్యులు" – ఖాళీ చేతులతో దేవుని ఎదుట నిలబడటం

ఒక ధనిక మహిళ మదర్ తెరెసాను కలసి,
"పేదలకు సహాయం చేయాలనుకుంటున్నాను. మీకు ఏమివ్వగలను?" అని అడిగింది.

మదర్ తెరెసా నవ్వుతూ అన్నది:
"నీ చేతులు."

ఆమె అయోమయంగా చూసింది.

"అవును," మదర్ తెరెసా అంది,
"వాటితో సేవ చేయి. డబ్బుతో కొనలేని బహుమతి అది."

ఆత్మలో పేదరికం అంటే:
"నేను పూర్తిగా దేవునిపై ఆధారపడుతున్నాను. అన్నీ ఆయన బహుమతులే."

ఇది పిల్లల వంటి విశ్వాసం:
"తండ్రీ, ప్రతి విషయంలో నాకు నీవు కావాలి."

ఖాళీ చేతులతో—
కృతజ్ఞత చేతులతో—
దేవుని ఎదుట నిలబడేవారినే ఆయన నింపగలడు.

యేసు అంటున్నాడు:
"వారిదే పరలోక రాజ్యం."

రాబోయేదే కాదు—
ఇప్పుడే.

## 6. "విలపించేవారు ధన్యులు" – బాధను పట్టించుకోలేని హృదయాలు

ఒక యువ ఉపాధ్యాయురాలు గమనించింది:
తన విద్యార్థుల్లో ఒకడు ఎప్పుడూ ఆకలితో, అలసటతో వస్తున్నాడు.
ఆమె సమస్యను పక్కన పెట్టలేదు.
ఉదయం తొందరగా వచ్చి,
అతనికి అల్పాహారం ఇచ్చి,
తరగతి ముందు విశ్రాంతి ఇచ్చింది.

సహోద్యోగులు అన్నారు:
"నీపై నీవు చాలా భారం వేసుకుంటున్నావు."

ఆమె సమాధానం:
"నేను చూసి చూడనట్టు ఉండలేను."

ఇదే యేసు చెప్పే విలాపం:
కేవలం దుఃఖం కాదు—
బాధను నిర్లక్ష్యం చేయలేని కరుణ.

అలాంటి వారు ఆదరణ పొందుతారు—
మాటలతో కాదు,
దేవుని చర్యతో,
దేవుని శక్తితో,
దేవుని జోక్యంతో.

మరియ – పరిపూర్ణ ఉదాహరణ

ధన్యవాక్యాలను మరియ యొక్క **స్తోత్రగీతం** (*మాగ్నిఫికాట్* తో) పోలిస్తే,

అవి ఒకదానికొకటి ప్రతిబింబంలా కనిపిస్తాయి.

మరియ:
• ఆత్మలో పేదది—"ఆయన తన దాసి వినయాన్ని చూశాడు,"
• శుద్ధ హృదయము—"నీ మాట ప్రకారం నాకు జరగనీ,"
• కరుణగలది—కరుణ ముఖమైన యేసును లోకానికి తీసుకువస్తుంది,
• న్యాయం కోసం ఆకలితో ఉన్నది—"ఆయన దీనులను పైకెత్తాడు,"
• సౌమ్యురాలు—బలవంతం చేయదు, ఆహ్వానిస్తుంది,
• విలపించేవారిలో ఒకరు—లోకముకోసం క్రీస్తుతో పాటు బాధపడుతుంది.

అందుకే ఆమె అంటుంది:
"తరతరాల వారు  నన్ను ధన్యురాలిగా పిలిచెదరు."

దేవుని అభినందనలు పూర్తిగా ఆమెపై నిలిచాయి.

యేసు కలగన్న కొత్త లోకం

ధన్యవాక్యాలు
యేసు కల—
దేవుని కల—
కొత్త లోకం కోసం.

మొదట అవి అసాధ్యంగా అనిపించవచ్చు.
కానీ అవి దేవునిలో పూర్తిగా జీవించే మనిషి చిత్రణ.

ఈ మార్గంలో జీవించడం
తప్పుదారి అనిపించవచ్చు,
విమర్శ రావచ్చు,
బాధ కూడా రావచ్చు.

కానీ అదే సమయంలో
అది స్వేచ్ఛను,
ఆనందాన్ని,
లోతైన అంతర్గత బలాన్ని ఇస్తుంది—
లోకం ఇవ్వలేని బలాన్ని.

మనము ధన్యవాక్యాలను
పూర్తిగా కాకపోయినా, నిజాయితీగా జీవిస్తే,
మనలో ఒక కొత్త లోకం పుట్టుతుంది,
తర్వాత మన చుట్టూ కూడా.

ఆలివ్ చెట్టు నాటిన మనిషి

మధ్యప్రాచ్యంలో ఒక పాత కథ ఉంది.
ఒక మనిషి ఆలివ్ చెట్టు నాటుతున్నాడు.

ఒకరు నవ్వుతూ అన్నారు:
"ఆలివ్ చెట్టా? నీవు దాని ఫలాలు తినేంత కాలం జీవించవు!"

ఆ మనిషి చిరునవ్వుతో సమాధానమిచ్చాడు:
"ముందు వాళ్లు నాటిన చెట్ల ఫలాలు నేను తిన్నాను.
ఇప్పుడు నా వంతు—నన్ను తర్వాత వచ్చే వారికోసం నాటటం."

ఇదే ధన్యవాక్యాల ఆత్మ.

మనము వాటిని
మన కోసమే కాదు,
యేసు కలగన్న లోకాన్ని నిర్మించేందుకు జీవిస్తాము—
కరుణ, శుద్ధ హృదయం, వినయం, న్యాయం, శాంతి
వేర్లు వేసే లోకం.

ఈ మార్గాన్ని ఎన్నుకున్నప్పుడు,
మీరు ధన్యులు—
ఇవి దేవుడు మీకు ఇస్తున్న అభినందనలు.

ఆమెన్.

**Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.**